సాక్షి
కాకినాడ
గురువారం । 14 । ఆగస్టు । 2025



వృద్ధాశ్రమానికి రూ.లక్ష విరాళం

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామలక్ష్మమ్మ, రామానాయుడు దివ్యాంగుల, వృద్ధుల ఆశ్రమానికి నల్లం వెంకటేశ్వరరావు (యర్నగూడెం) బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు.




చరిత్ర పుటల్లో రక్తాక్షరాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం విశిష్టత అమోఘమైంది.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 1,18,371 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. గోదావరి డెల్టా కాలువలకు సంబంధించి 5,050 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 1,250, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

సీతారామ సత్రం పరిశీలన



సత్రం శ్లాబ్, బీమ్‌ల నాణ్యతను పరిశీలిస్తున్న జేఎన్‌టీయూకే బృందం

అన్నవరం: రత్నగిరిపై శిథిలావస్థకు చేరిన శ్రీ సీతారామ సత్రాన్ని జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు బుధవారం పరిశీలించారు. గతంలో ఈ సత్రాన్ని కూల్చివేయాలని వారు సూచించడం, కాదు.. మరమ్మతులు చేస్తే సరిపోతుందని దేవదాయ సలహాదారు సిఫార్సు చేయడం.. దీనిపై వివాదం నెలకొన్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ 26న 'సాక్షి'లో 'సత్యదేవ చూడవయ్యా' శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ షణ్మోహన్, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈ సత్రాన్ని జేఎన్‌టీయూకే బృందం మళ్లీ పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వారి నివేదిక ఆధారంగా కొత్త సత్రాన్ని నిర్మించనున్నారు. ఈ మేరకు వర్సిటీ ప్రొఫెసర్లు వి.రవీంద్ర, జి.ఏసురత్నంతో కూడిన బృందం సత్రాన్ని పరిశీలించి అనంతరం దేవస్థానం ఈఈ వీర్ల సుబ్బారావు, ఈఈ వి.రామకృష్ణతో చర్చించి వారం రోజుల్లో నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపారు.

టెండర్ ఖరారై మూడు నెలలైనా..

రూ.11.40 కోట్ల వ్యయంతో తొలి దశలో నాలుగు అంతస్తులలో 105 గదులతో సత్రం నిర్మాణానికి టెండర్లు పిలవగా దాదాపు 16 శాతం లెస్‌కు టెండర్లు ఖరారయ్యాయి. ఇది జరిగి మూడు నెలలైనా సత్రం ఎక్కడ నిర్మించాలన్న స్పష్టత లేక పనులు ప్రారంభం కాలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల విద్యాశాఖ జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనపరచిన పాఠశాలల నుంచి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ బుధవారం తెలిపారు. జిల్లా నుంచి 5 పాఠశాలలకు ఈ అవార్డులు అందిస్తామన్నారు. 2025 సంవత్సరంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొన్న క్రీడాకారుల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలపై పాఠశాల హెచ్‌ఎం, పీడీ సంతకం చేసి ఈ నెల 18వ తేదీ లోపు కాకినాడలోని ఎస్‌జీఎఫ్‌ఐ కార్యాలయంలో కార్యదర్శి ఎల్.జార్జికి అందజేయాలని కోరారు.

అక్షరాంధ్రపై శిక్షణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లా వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒకరోజు శిక్షణ తరగతి నిర్వహించారు. జిల్లా వయోజన విద్య శాఖ ఉపసంచాలకుడు పసుపులేటి పోశయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తదితరులు హాజరై నూరు శాతం అక్షరాస్యత సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఉద్యమానికి ఊపిరై!



- స్వాతంత్య్ర ఉద్యమ దివిటీలెన్నెన్నో..
- పల్లెపల్లెలో రగిలిన పోరాట స్ఫూర్తి
- మహనీయుల త్యాగాలు.. చరితలతో నిండిన నేల
- త్రివర్ణ పతాక రెపరెపల వేళ.. త్యాగధనుల సంస్మరణలివి

పిఠాపురం: స్వాతంత్య్రం వచ్చెనని సభలే చేసి.. సంబరపడగానే సరిపోదోయీ.. సాధించిన దానికి సంతృప్తిని పొంది.. అదే విజయమనుకుంటే పొరపాటోయీ.. అని దేశ శృంఖలాలు విడివడిన తొలినాళ్లలోనే ఎందరో అభ్యుదయ కవులు ఇటువంటి ఎన్నో దేశభక్తి గేయాలకు పదాలు కూర్చారు. ఎందరో మహానుభావుల త్యాగాలతో సాధించుకున్న స్వరాజ్యాన్ని ప్రతి భారతీయుడు నరనరానా జీర్ణించుకోవాలి. చేసే ప్రతి పనిలో జాతీయభావాన్ని నింపుకొని జాతి ఔన్నత్యానికి కృషి చేయాలి. అప్పుడే స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలకు విలువ. రేపు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

స్ఫూర్తి రగిలించిన 'చల్లా'

ఆస్తులున్నా ఆనందంగా జీవించే స్వాతంత్య్రం లేనప్పుడు అవి అనుభవించే అర్హత మనకు లేదంటూ దేశం కోసం తృణప్రాయంగా త్యాగం చేసిన చిరస్మరణీయులలో కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు చల్లా నారాయణమూర్తి ఒకరు. ఈయన 1911–2003 మధ్య కాలంలో జీవించిన ఆయన ఆంగ్లేయుల పాలనను తీవ్రంగా వ్యతిరేకించారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్రాన్ని స్వీకరించారు. అలహాబాద్‌లో కాంగ్రెస్ సేవాదళ్ సహాయ కార్యదర్శిగా కూడా ఆయన పని చేశారు. స్వాతంత్య్రోద్యమానికి హిందీ భాష అవసరం కావడంతో జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ వద్ద ఆ భాషను నేర్చుకున్నారు. అంతే కాకుండా గోండా జైలులో లాల్‌బహదూర్‌శాస్త్రితో కలిసి 6 నెలలు కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని శిక్షలు అనుభవించారు. జవహర్‌లాల్ నెహ్రూ, కేడీ మాలవ్య, ఉమాశంకర్ దీక్షిత్, టంగుటూరి ప్రకాశంపంతులు, పొట్టి శ్రీరాములు, మల్లిపూడి పళ్లంరాజు మొదలైన వారితో సత్సంబంధాలు ఉండేవి. మహాత్మగాంధీ వంటి జాతీయ నాయకులతో కలిసి పది రోజుల పాటు తీహార్ జైలులో గడిపారు. మద్దూరి అన్నపూర్ణయ్యతో కలిసి విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యంలో పాల్గొన్నారు. పీయూసీ వరకు చదివిన ఆయన వివిధ భాషల్లో మంచి ప్రావీణ్యం పొందారు. తాటిపర్తి గ్రామానికి ఆయన తొలి సర్పంచ్‌గా పని చేసి గ్రామాన్ని విద్యుత్ వెలుగులతో నింపారు. గొల్లప్రోలు కో ఆపరేటివ్ సొసైటీకి అధ్యక్షుడుగా పని చేశారు.



తాటిపర్తిలో నారాయణమూర్తి గృహం

నారాయణమూర్తి (ఫైల్)

అస్పృశ్యత నిర్మూలనకు కృషి

కుల మతాలకు అతీతంగా ఆయన వ్యవహరించేవారు. నిమ్న కులాలను ఎంతో ఆదరించి, విద్యాబుద్ధులు నేర్పేవారు. ఆయన వద్ద విద్యనభ్యసించిన ఎందరో నేడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు.

ఆస్తంతా అర్పించి.. అవస్థలు

నారాయణమూర్తి పెద్ద భూస్వామిగా పేరొందారు. స్వాతంత్య్ర పోరాటంలో తనకు ఉన్న 150 ఎకరాల భూమిని నగదు, ఆభరణాలను అర్పించారు. తన కుటుంబ పోషణను కూడా లెక్క చేయకుండా కేవలం స్వాతంత్య్ర సమరం కోసం మొత్తం సమర్పించారు. ఆయనకు ఏడుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరంతా చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ పట్టణాల్లో జీవిస్తున్నారు. 2003లో ఆయన కన్నుమూసేనాటికి ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పిల్లల పెళ్లిళ్లు చేయలేని స్థితి ఏర్పడింది. క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొన్న స్వాతంత్య్ర సమర యోధులకు క్రాంతి మైదాన్ పేరిట అప్పటి కలెక్టర్ సతీష్ చంద్ర, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు తదితరులు ఆయనను సత్కరించారు. తాటిపర్తిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన జీవిత చరిత్రను ప్రస్తుత జనాలకు తెలిసేలా శిలాఫలకం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ తొలి సమావేశంలో ఆయన జైలు జీవితం అనుభవించినట్లుగా తొలి తీర్మానం చేశారు.

ఆదరిస్తామన్నా తిరస్కరించి..

ఆయన చివరి రోజుల్లో ప్రభుత్వ ఆదరణ అవకాశాన్ని సైతం ఆయన సున్నితంగా తిరస్కరించారు. తాను ఏదో సంపాదించుకోవాలని పోరాటం చేయలేదని ఉన్నదాని కంటే స్వాతంత్య్రం వచ్చిందన్న సంతృప్తే నాకు కోట్ల ఆస్తితో సమానమని పేర్కొన్నారు. దీంతో ఆయనను సన్మానించి అధికారులు వెనుదిరిగారు.

మహాత్ముడు నడయాడిన చౌక్!



సామర్లకోట గాంధీచౌక్‌లో బాపూజీ విగ్రహం

సామర్లకోట: స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా మహాత్మ గాంధీ సామర్లకోటలో పర్యటించడంతో ఆ ప్రాంతానికి గాంధీచౌక్‌గా నామకరణం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమంపై ప్రజలను చైతన్యపరచడానికి ఆయన రైలులో సామర్లకోట వచ్చారు. ఇంజిన్‌లో బొగ్గు నింపడానికి గంట సమయం అవసరం కావడంతో రైలును నిలిపివేశారు. రైలులో గాంధీజీ ఉన్నారని తెలుసుకున్న స్థానికులు వెళ్లి ఆయనను కలుసుకున్నారు. ఐక్యతతో శాంతియుతం ఉద్యమాలు చేయాలని ఆయన వారికి పిలుపు నిచ్చారని, ఇతరులకు సాయం చేయాలని గాంధీజీ చెప్పిన మాటలను స్థానికులు మేకా వీర్రాజు, చుండ్రు గొల్లబ్బాయి, యార్లగడ్డ గోవిందులు సాక్షికి తెలిపారు. గాంధీజీ మరణం తరువాత పేదలకు అంబలి పోయడం ప్రారంభించామని చెప్పారు. రైలులో గాంధీ దిగిన ప్రాంతానికి గాంధీచౌక్‌గా నామకరణం చేసినట్టు తెలిపారు. గాంధీజీ మరణాంతరం ఆ ప్రాంతంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా కాకినాడ మున్సిపాలిటీ అభ్యంతరం తెలిపారని, అయితే అప్పట్లో ప్రముఖ సామాజికవేత్త, దివంగత సమయం వీర్రాజు పోత్సాహంతో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించి వందో జయంతి వరకు స్థానికులకు అంబలి పోసినట్టు గాంధీ యువజన సంఘం నాయకులు తెలిపారు. రైల్వే పట్టాల సమీపంలో ఏర్పాటు చేసిన తాటాకు పాక నేటికీ ఉంది. పాక సమీపంలోనే ఉండే గాంధీ విగ్రహాన్ని సెంటర్‌లో ఏర్పాటు చేశారు. ఇటీవల పాత విగ్రహం స్థానంలో నూతన కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు.

పోరాటాల కల్పవల్లి కొత్తపల్లి



ఉప్పాడలో స్వాతంత్య్ర సమరయోధుడు పుత్సల సత్యనారాయణ విగ్రహం



రావు అచ్చయ్యారావు, మాజీ ఎమ్మెల్సీ

మన తెలుగునేల ఎందరో మహానుభావులకు పుట్టినిల్లు. చరిత్రకారులకు జన్మస్థలమైన కొత్తపల్లి అలనాటి వైభవాన్ని నేటికీ చాటిచెబుతోంది. ఎక్కడ చూసినా చరిత్ర ఆనవాళ్లు దర్శనమిస్తుంటాయి. స్వాతంత్య్ర ఉద్యమం తొలినాళ్లలో అప్పటి పిఠాపురం తాలూకాలో కొత్తపల్లి ఫిర్కాకు ప్రత్యేక స్థానం వుంది. ఎందరో చరిత్రకారులు, స్వాతంత్య్ర సమరయోధులు, రాజవంశీయుల పుట్టినిల్లు కొత్తపల్లి. పిఠాపురం తాలూకాలో ఐదు వేల జనాభాతో అతిపెద్ద గ్రామంగా విరాజిల్లింది. దివ్య క్షేత్రంగాను, కళా కేంద్రంగాను, సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా, సాహితీ మందిరంగా రాజకీయ చైతన్యానికి ఆలవాలంగా చరిత్ర పుటలకెక్కింది. రావు అచ్చియ్యారావు, పుత్సల సత్యనారాయణ, రావు వెంకట జగ్గారావు, అల్లిక సన్యాసయ్య, జ్యోతుల కాశీస్వామి, జ్యోతుల శేషయ్య, చిట్టాడ చిన్న ముత్యాలు వంటి ఎందరో స్వాతంత్య్ర సమరయోధులు కొత్తపల్లిలో జన్మించి దేశ అభ్యుదయానికి తమ వంతు కృషి చేశారు. నాటి కొత్తపల్లి రాజకీయ కారణాలతో వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లిగా విడిపోయింది. కాకతీయుల ఘనతను చాటి చెప్పిన రావు వారి వంశం ఈ గ్రామంలోనే అధిక శాతం నివసించారు.. నివసిస్తున్నారు. ఆయుర్వేద వైద్యానికి, వస్త్ర పరిశ్రమలకు నిలయమై, స్వాతంత్య్ర సమరం, ఉప్పు సత్యగ్రహం, విదేశీ వస్త్ర బహిష్కరణ, ఖద్దరు ప్రచారం, హరిజనోద్ధరణ కార్యక్రమాలకు కొత్తపల్లి వేదికైంది. బులుసు సాంబమూర్తి సారథ్యంలో కొత్తపల్లిలో ప్రథమ రాజకీయ మహాసభ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ మహాసభ కొత్తపల్లి చరిత్రలో కలికితురాయి. ఆ సమయంలోనే స్థానికులు విదేశీ వస్త్రాలను గుట్టలుగా పోసి తగులబెట్టారు. దీంతో వారిపై అక్రమ కేసులు బనాయించినా పిఠాపురం తాలూకా పరిధిలో సాక్ష్యం చెప్పేవారు లేక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహా సభకు నాయకులు కొత్తపల్లి నుంచే భారీ సన్నాహాలు చేశారు. మహాత్మ గాంధీ, పండిట్ నెహ్రూ, జయప్రకాష్ నారాయణ, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి ఎందరో స్వాతంత్య్ర సమరయోధులు ఎందరో ఇక్కడ సందేశాలిచ్చి ప్రజలను చైతన్యపరిచారు. సద్గ్రంథాలు, సన్మిత్రులవలే సహృదయ శాసనాలు కావిస్తాయని నమ్మిన అప్పటి స్వాతంత్య్ర సమర యోధులు రావు అచ్చియ్యారావు తన స్వగ్రామం కొత్తపల్లిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. టౌన్ హాల్‌గా పిలిచే ఆ గ్రంథాలయంలో రాజకీయ, సామాజిక, స్వాతంత్య్ర సంగ్రామం గ్రంథాలను ఏర్పాటు చేశారు. దీనిని విజ్ఞాన మందిరంగాను, కళా కేంద్రంగా రూపొందించారు. సభలు, సమావేశాలు, విద్యాగోష్ఠులు, నిర్వహించడంతో ఈ గ్రంథాలయానికి ఎంతో ప్రాచీనత సంతరించుకుంది.



స్వాతంత్య్ర సమరయోధులు సమావేశమైనది ఈ ఇంటిలోనే..



పోరాట స్ఫూర్తికి.. ఉద్యమ కార్యాచరణకు నిలయమైన టౌన్‌హాల్

స్వాతంత్య్ర సమరయోధుల వైద్య సేవల కోసం సుమారు 118 ఏళ్ల చరిత్ర గలిగిన కొత్తపల్లిలోని శ్రీలక్ష్మి గణపతి ఆయుర్వేద నిలయం ఎంతగానో తోడ్పడేది. విదేశీ వస్త్ర బహిష్కరణకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కొత్తపల్లిలో ఖద్దరు తయారీ కేంద్రాలను నెలకొల్పారు. అదే నేడు కొత్తపల్లికి ఘన కీర్తిని తెచ్చిపెట్టింది. ఉప్పు సత్యాగ్రహం సమయంలో అప్పట్లో ఉప్పువాడగా పేరొందిన ప్రస్తుతం ఉప్పాడను పలువురు స్వాతంత్య్ర సమరయోధులు సందర్శించి నట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

వనామీపై సునామీ

- సిండి'కాటు' నుంచి సుంకాల 'వేటు' వరకు మరోసారి రొయ్యకు కష్టకాలం
- రెండుసార్లు అమెరికా సుంకాల దాడి
- విదేశాలకు వెళ్లేది 50 కౌంట్ లోపు మాత్రమే..
- టారిఫ్ పేరిట మొత్తం కౌంట్ల ధర కుదింపు
- ప్రస్తుతం సాగు 20 శాతమే..
- ఉమ్మడి తూర్పున 23 వేల ఎకరాల్లో ఆక్వా సాగు



సాక్షి, అమలాపురం: ఓవైపు కొలుగోలుదారులు సిండికేటుగా మారి ధర పెరిగినప్పుడల్లా ఏదో కారణంతో తగ్గించేస్తున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల దాడితో ఆక్వా రైతులు విలవిల్లాడుతున్నారు. ఏడాది కాలంగా వనామీ రొయ్యలకు అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరిగిన ప్రతిసారీ ఏదోక ఉపద్రవం రావడం.. ధర పతనం కావడం పరిపాటిగా మారింది. ఎటువంటి ఇబ్బందులు లేకున్నా.. స్థానిక కొనుగోలుదారులు ధర తగ్గించి ఆక్వా రైతుల నడ్డివిరుస్తున్నారు. తాజాగా ట్రంప్ టారిఫ్ ప్రకటనతో మరోసారి వనామీ ధరలు తగ్గడం రైతుల్లో కొత్త ఆందోళనకు తెర తీసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో తీర ప్రాంత మండలాల్లో వనామీ రొయ్యల సాగు అధికంగా సాగుతోంది. కాకినాడ జిల్లాలో సుమారు 8 వేల ఎకరాల్లో ఈసాగు ఉండగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో దాదాపు 15 వేల ఎకరాల్లో జరుగుతున్నట్టు అంచనా. ఆయా జిల్లాల్లో మొత్తం 23 వేల ఎకరాల్లో సాగవుతున్నట్టు ఆక్వా వర్గాలు చెబుతున్నాయి. మొదటి పంట పూర్తయి, రెండో పంటకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం కోనసీమ జిల్లావ్యాప్తంగా 20 శాతం మాత్రమే చెరువుల్లో వనామీ రొయ్యలున్నాయి.

సందు దొరికితే..

అంతర్జాతీయంగా ఏ చిన్న సంఘటన జరిగినా దానిని బూచిగా చూపించి రొయ్యల ధరలు తగ్గించడం కొనుగోలుదారులకు పరిపాటిగా మారింది. వీరంతా సిండికేట్‌గా ఉండడంతో ఒకే మాటపై ధరలు తగ్గించేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో వనామీ రొయ్యలకు మంచి ధర పలికింది. మార్కెట్‌కు రొయ్యలు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో కౌంట్‌కు రూ.20 చొప్పున ధర తగ్గించారు.

- ఏప్రిల్ తొలి వారంలో ట్రంప్ టారిఫ్ ప్రకటించగానే, దానిని అడ్డుపెట్టుకుని ధరలు భారీగా తగ్గించారు. కౌంట్‌కు రూ.60 వరకు ధర క్షీణించింది. తర్వాత సుంకాల విధింపు మూడు నెలల పాటు వాయిదా వేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. కానీ కౌంట్‌కు రూ.15 మాత్రమే ధర పెంచడం గమనార్హం.
- గత నెల నుంచి చెరువులు ఖాళీ అయి మార్కెట్‌కు రొయ్యల రాక తగ్గింది. దీంతో ధరలు మరోసారి పెరిగాయి. ఇదే సమయంలో ట్రంప్ సుంకాల ప్రకటన రైతులను కుదేలు చేసింది. వనామి ధరలు మరోసారి పతనమయ్యాయి.
- జిల్లా నుంచి ఎగుమతి అయ్యే వనామీ, సముద్రంలో దొరికే టైగర్, ఇతర రొయ్యలు 70 శాతానికి పైగా అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. గతంలో యన్టీ డంపింగ్ టాక్స్ 4.5 శాతం, డీవీడీ ట్యాక్స్ 5 శాతం చొప్పున మొత్తం 9.5 శాతం మాత్రమే టాక్స్ ఉండేది. దీనిపై అదనంగా 25 శాతం టాక్స్‌ను ట్రంప్ ప్రభుత్వం అమలు చేస్తోంది. అంటే మొత్తం 34.9 శాతం టాక్స్ భారం పడుతోంది.
- వాస్తవంగా ట్రంప్ టారిఫ్ ప్రభావం మొదట పడేది అమెరికాలోని వినియోగదారులపైనే. ఇదే వంకతో కొనుగోలుదారులు ఇక్కడ రొయ్యల కొనుగోలు నిలిపివేశారు. ఇప్పుడు కేవలం 25 శాతం సుంకం ఉండగా, ఈ నెల 25వ తేదీ నుంచి 50 శాతం వసూలు చేయనున్నారు. దీంతో వనామీ ధరలు మరింత పతనం కానున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- ఆగస్టు నెలాఖరు నుంచి రెండో పంటకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సమయంలో వారిపై సుంకాల పిడుగు పడింది. దీంతో రైతులు సాగు విషయంలో పునరాలోచనలో పడ్డారు. 50 శాతం టారిఫ్ వల్ల ధరలు మరింత తగ్గితే.. సాగుకు తాత్కాలిక విరామం ఇచ్చేందుకూ వెనుకాడేది లేదంటున్నారు.

గత జనవరి నుంచి ఇప్పటి వరకు కౌంట్ ధరలు ఇలా..

కౌంట్ రకం	ఫిబ్రవరి తొలి వారంలో	మార్చి తొలి వారంలో	తొలిసారి సుంకాలు ప్రకటించాక...	పది రోజుల క్రితం మార్కెట్	రెండోసారి సుంకాలు ప్రకటించాక
30	470	465	425	440	390
40	415	390	340	400	345
50	375	365	320	375	325
60	345	335	300	345	305
70	320	300	295	325	325
80	285	270	255	295	265
90	265	250	235	275	245
100	255	240	225	265	235

ధరపై తీవ్ర ప్రభావం

రొయ్యల లభ్యత తక్కువగా ఉన్న సమయంలో వాటి కౌంట్లకు మంచి ధర రావడం సాధారణం. ఈసారి కూడా మంచి ధర వచ్చింది. పది రోజుల క్రితం రొయ్యల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వంద కౌంట్ (కిలోకు వంద రొయ్యలు) ధర రూ.265 వరకు ఉండగా, 90 కౌంట్ రూ.275గా, 80 కౌంట్ రూ.295గా, 70 కౌంట్ రూ.325గా, 60 కౌంట్ రూ.345గా, 50 కౌంట్ రూ.375గా, 40 కౌంట్ రూ.395గా, 40 కౌంట్ రూ.440 వరకూ ఉండేది. ఈ సమయంలో ట్రంప్ రెండోసారి భారతీయ దిగుమతులపై 25 సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దీనిని తర్వాత 50 శాతానికి పెంచారు. ప్రస్తుతం 25 శాతం సుంకాలు అమలులో ఉన్నాయి. సుంకాల ప్రకటన తర్వాత వనామి రొయ్యల ధరలను కొనుగోలుదారులు మరోసారి తగ్గించేశారు. కౌంట్‌కు వచ్చి రూ.30 నుంచి రూ.50 వరకూ కోత పెట్టడం గమనార్హం. వంద కౌంట్ ధర రూ.235 వరకు తగ్గగా, 90 కౌంట్ రూ.245, 80 కౌంట్ రూ.265, 70 కౌంట్ రూ.285, 60 కౌంట్ రూ.305, 50 కౌంట్ రూ.325, 40 కౌంట్ రూ.345, 30 కౌంట్ రూ.390కి పడిపోయాయి.

'పంపా' పరవళ్లు

94 అడుగులకు చేరిన నీటిమట్టం



వర్షపు నీటితో పరవళ్లు తొక్కుతున్న పంపా రిజర్వాయర్

అన్నవరం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నవరంలోని 'పంపా' రిజర్వాయర్‌కు భారీగా వాననీరు వచ్చి చేరుతోంది. ఫలితంగా నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 94 అడుగులకు చేరింది. పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల రిజర్వాయర్‌లోకి 400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో రిజర్వాయర్ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. గురువారం ఉదయానికి పంపా నీటిమట్టం 95 అడుగులకు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పంపా ఆయకట్టుకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సబ్సిడరీ డ్యామ్ ద్వారా పది క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటి నిల్వ 0.43 టీఎంసీ కాగా, ప్రస్తుతం 0.24 టీఎంసీ నిల్వ ఉందని అధికారులు తెలిపారు. గత నెల 26న పంపా నీటిని ఆయకట్టుకు విడుదల చేసిన విషయం తెలిసిందే. అప్పుడు నీటిమట్టం 94 అడుగులు ఉంది. అయితే అప్పటి నుంచి వర్షాలు లేకపోవడం, రిజర్వాయర్ నీటిని ఆయకట్టుకు విడుదల చేయడంతో నీటిమట్టం రోజు రోజుకీ తగ్గుతూ వచ్చింది. మంగళవారం పంపా నీటిమట్టం 92 అడుగులకు పడిపోయింది. మంగళవారం నుంచి పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో నీటిమట్టం మళ్లీ 94 అడుగులకు చేరింది.

జిల్లాలో భారీ వర్షాలు

- పలుచోట్ల నీట మునిగిన పంటలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు



తొండంగి మండలం దానవాయిపేట సముద్రతీరంలో ఎగసిపడుతున్న సముద్ర అలలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో బుధవారం కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. కాకినాడలో మెయిన్‌రోడ్డు, టూటౌన్ నూకాలమ్మ గుడి వీధి, సినిమారోడ్డు, ఎల్‌బీనగర్, కొత్తపేట మార్కెట్ వంటి పలు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. జిల్లాలో పలు మండలాల్లో వరి పంట నీట మునిగింది. సామర్లకోట, కాకినాడ రూరల్, కరప, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లో అధికంగా వర్షాలు కురవడంతో నాట్లు పూర్తిగా మునిగిపోయాయి.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శిథిల భవనాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆయన తెలిపారు. జిల్లాలో వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బంది ఏర్పడినా టోల్ ఫ్రీ నెంబర్, కంట్రోల్ రూమ్‌లో ఉన్న 0884 2356801 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
కిలో	400

క్లుప్తంగా

హెచ్ఐవీ పరీక్షల శాతాన్ని పెంచాలి

అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ భరతలక్ష్మి

అమలాపురం టౌన్: ఏఆర్‌టీ కౌన్సిలర్లు హెచ్ఐవీ పరీక్షల శాతాన్ని పెంచాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్ భరతలక్ష్మి అన్నారు. జిల్లాలో హెచ్ఐవీ వ్యాప్తి చెందకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏఆర్‌టీ కౌన్సిలర్లకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుని నుంచి నలుగురు భాగస్వాములను గుర్తించి, వారికి పరీక్షలు చేయాలని, వేరొకరికి వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఐ.ప్రభాకరరావు, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ గంటల ఆదిలింగం తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లో రక్తాక్షరాలు

- వాడపల్లి క్షేత్రంలో స్వాతంత్య్ర పోరాటం
- వెంకన్న కల్యాణోత్సవ రథంపై జెండా ఎగురవేశారని దేశభక్తులపై బ్రిటిష్ వారి కాల్పులు
- అమరులైన అనేక మంది.. మరెందరో క్షతగాత్రులు
- ఆనాటి సంఘటనకు సాక్షిగా ఆలయం వద్ద స్మారక స్థూపం
- భక్తులు తిలకించేలా వెలుగులోకి తెచ్చే ప్రణాళిక



వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి క్షేత్రం

కొత్తపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం విశిష్టత అమోఘమైంది. అశేష భక్తజన సంద్రంతో కోనసీమ తిరుమలగా వెలుగొందుతున్న ఈ క్షేత్రానికి సంబంధించి ఈ తరానికి తెలియని మరో ముఖ్య చరిత్ర కూడా ఉంది. ఇదే ఈ గడ్డపై దైవ భక్తులతో పాటు దేశభక్తుల ఉనికిని చాటుతోంది. వాడపల్లి గ్రామం చిన్నదైనా.. ఇక్కడి నేల పొరల్లో దశాబ్దాల క్రితం త్యాగాలను నాటి.. రక్తాన్ని ధారపోశారు. ఇవన్నీ భారతావని కోసం.. జాతి విముక్తి కోసం. అప్పట్లో దేశంలో ఎన్నో త్యాగాలు చేసిన అనేక పల్లెలుంటే.. అందులో వాడపల్లి ప్రత్యేకతను సంతరించుకుంది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని.. చరిత్ర పుటల్లో వాడపల్లిలో దేశభక్తులపై బ్రిటిష్ వారి దాష్టీకం, ఆంగ్లేయులకు ఎదురెళ్లి రక్తం చిందించిన త్యాగధనులను స్మరించుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులపై ఉంది.

రథంపై జాతీయ జెండా ఎగరేసినందుకు..

1931 మార్చి 30 చైత్ర శుద్ధ ఏకాదశి పర్వదినం. వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా రథోత్సవం జరగనుంది. ఆరోజు మాతృదాస్య శృంఖలాల విమోచనోద్యమ రథసారథి బాపూజీ శంఖారావానికి ప్రతిస్పందించిన స్వాతంత్య్ర సమరయోధులు.. బ్రిటిష్ పాలకుల నిరంకుశ పాలనను సంఘటితంగా ప్రతిఘటించిన పవిత్ర దినం. రథోత్సవ వేడుకల్లో భక్తితో పాటు, దేశభక్తినీ చాటేందుకు రథంపై బాపూజీ చిత్రపటాన్ని ఉంచి, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. శత్రు స్థావరంపైకి దండెత్తుతున్న సైనికుల్లా పల్లె ప్రజలు పెద్ద ఎత్తున కదలివచ్చారు.

అసువులు బాసిన సమరయోధులు

అప్పటి రాజమండ్రి డీఎస్పీ ముస్తఫా ఆలీఖాన్ కరుడుగట్టిన బ్రిటిష్‌వాది. అతను అప్పటికే సీతానగరంలోని గాంధీ ఆశ్రమాన్ని చిన్నాభిన్నం చేసి, అక్కడి వారిని రక్తమోడేలా కొట్టడంతో బ్రిటిష్ అధికారుల మన్ననలు పొందాడు. ఇక్కడ అతడే రంగంలోకి దిగాడు. రథంపై జెండాను తీసేయాలని, గాంధీ చిత్రాన్ని తొలగించాలని దేశభక్తులను హెచ్చరించాడు. అతడి హెచ్చరికలకు వారెవ్వరూ వెనక్కి తగ్గకుండా, రథాన్ని ముందుకు నడిపించారు. ఈ తరుణంలో గాల్లో కాల్పులు జరిపినా.. ఎవరూ బెదరలేదు. పరిస్థితి చేజారుతుందని గ్రహించిన ఆలీఖాన్.. దేశభక్తులపై తన బలగాలతో తూటాల వర్షం కురిపించాడు. ఈ ఘటనలో ఎందరో అమరులయ్యారు. మరెందరో తీవ్రంగా గాయపడ్డారు. అయినా దేశభక్తులు ప్రాణభయంతో పారిపోలేదు. బ్రిటిష్ సైనికులపై తిరగబడ్డారు. దీంతో ఆలీఖాన్ అక్కడి నుండి తప్పించుకున్నాడు. కొత్తపేట తాలూకాకు చెందిన కరటూరి సత్యనారాయణ, పాతపాటి వెంకటరాజు, వాడపల్లి గంగాచలం అమరులయ్యారు. అలాగే బండారు నారాయణస్వామికి బుల్లెట్ గాయాల కారణంగా రెండు కాళ్లు తొలగించినా ప్రాణం దక్కలేదు.

సమరయోధులపై కేసులు

ఆ స్వాతంత్య్ర ప్రతిఘటనను కుట్రగా పేర్కొని, ఆనాటి సమరయోధులైన నంబూరి జగ్గరాజు, నామన బాపన్న, పెన్మెత్స సత్యనారాయణ రాజు, దాట్ల సత్యనారాయణ రాజు, పెన్మెత్స వెంకట నరసింహరాజు, చేకూరి సూర్యనారాయణ రాజు, చేకూరి రామరాజు, ముదునూరి గనిరాజు, మెర్ల శాస్త్రులు, సాగిరాజు వెంకట సుబ్బరాజు, సాగిరాజు వెంకటరాజు, తూము వెంకన్న, ముదునూరి నారాయణరాజు, ఇందుకూరి సూర్యనారాయణ రాజు, నకినేటి సుబ్బరాజు, నంబూరి తాతరాజు, దంతులూరి లక్ష్మీపతి రాజు, పడాల సుబ్బారెడ్డి, దండు జగ్గరాజు, ముదునూరి సుబ్బరాజు, మైపాల రామన్న, ఇందుకూరి రామరాజు, ముదునూరి సూర్యనారాయణ రాజు, మద్దిపాటి సత్యనారాయణను బ్రిటిష్ పోలీసులు దోషులుగా చిత్రించారు. అయితే పోలీసుల అభియోగం దారుణమని, దోషులుగా పేర్కొన్న వారంతా నిర్దోషులని 1931 నవంబర్ 23న జిల్లా న్యాయాధిపతులు జస్టిస్ కేపీ లక్ష్మణరావు, జస్టిస్ ఎంఆర్ శంకరయ్య తీర్పు చెప్పారు. నిందితులకు అండగా ఈ కేసు సాక్షులను కళా వెంకట్రావు సేకరించారు.

ఆలయం వద్ద స్మారక స్థూపం

వాడపల్లిలో జరిగిన ఆ వీరోచిత సంఘటన బ్రిటిష్ వారినే ఆశ్చర్యపరచింది. ఆ ఘటనలో అసువులు బాసిన అమర వీరులు, క్షతగాత్రులు రక్తం చిందించిన ఆ పవిత్ర ప్రదేశంలో నిర్మించిన స్మారక చిహ్నమే ఈ స్థూపం. వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం ముందు స్వాతంత్య్ర సమరయోధుల శిలాఫలకాన్ని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే మంతెన వెంకటసూర్య సుబ్బరాజు (ఎంవీఎస్ సుబ్బరాజు) నెలకొల్పారు. దానిని 1987 అక్టోబర్ రెండున గాంధీ జయంతి సందర్భంగా ఆవిష్కరించారు.

సుందరమైన పార్కు

ఆలయానికి ఎదురుగా ఏడు వారాలు–ఏడు ప్రదక్షిణలు చేసే మార్గంలో ఉన్న ఈ స్థూపాన్ని మార్చడానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రదేశం నుంచి స్మారక స్థూపాన్ని కొత్తగా నిర్మిస్తున్న కోనేరు వద్ద ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్, ప్రజాప్రతినిధుల దృష్టిలో పెట్టారు. వారు సానుకూలంగా స్పందించి, అనుమతులు ఇచ్చారు. భక్తులకు ఈ క్షేత్రంలో దేశభక్తుల విశిష్టతను తెలియజేసేలా సుందరమైన పార్కును నిర్మించి, మధ్యలో స్మారక స్థూపానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించేలా ప్రణాళిక రూపొందించనున్నారు. ఇన్నాళ్లూ ఓ పక్కన ఉన్న స్మారక స్థూపాన్ని వెలుగులోకి తెచ్చే ప్రక్రియకు ఈ నెల 15 తర్వాత శ్రీకారం చుట్టనున్నారు.



వాడపల్లిలో ఆలయం వద్ద స్మారక స్థూపమిదే..

పీఎంవీబీఆర్‌వైతో ఉద్యోగి, యజమానులకూ ప్రయోజనాలు

ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు



రాజమహేంద్రవరం రూరల్: ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) కింద నమోదు చేసుకుంటే ఉద్యోగికి అదనపు వేతనం, యజమానికి ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ప్రాంతీయ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరంలోని పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఈ పథకం అమలుపై క్రెడాయ్, ఇతర సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఈ పథకం ఆగస్టు ఒకటి నుంచి అమలులోకి వచ్చిందని చెప్పారు. తొలిసారి ఉద్యోగం పొందిన వ్యక్తి ఖాతాలో ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని (బేసిక్+డీఏ) ప్రభుత్వం రెండు విడతల్లో జమ చేస్తుందన్నారు. గరిష్ఠంగా రూ.15 వేల వరకు పొందవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 1.92 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. యజమానికి కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు చెప్పారు. కనీసం ఆరు నెలల నిరంతర ఉపాధి ప్రాతిపదికన నియమించుకున్న ప్రతి అదనపు ఉద్యోగికి యాజమాన్యాలకు నెలకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు రెండేళ్ల పాటు ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ఉద్యోగులకు ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) ద్వారా, యాజమాన్యాలకు వారి పాన్ అనుసంధానిత ఖాతాల ద్వారా చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి 2027 జూలై 31 మధ్యన కల్పించిన ఉద్యోగాలకే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయని వివరించారు. 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఇందుకు రూ.99,446 కోట్లను కేటాయించినట్టు చెప్పారు.

12 వేల కంపెనీలు

రాజమండ్రి ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయ పరిధిలోని ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 12 వేల కంపెనీలు నమోదై ఉన్నాయని, తప్పనిసరిగా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యోగుల పీఎఫ్ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు ఉంటాయని, జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. నిర్మాణ రంగంలో ఎక్కువ మంది పనిచేస్తున్నారని, వారంతా పథక పరిధిలో వచ్చేలా క్రెడాయ్ చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్య నిధి సంస్థలో సభ్యత్వం తీసుకుని, కనీసం ఏడాది సర్వీస్ కలిగిన వారికి ప్రమాద బీమా రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు లభిస్తుందని చెప్పారు. సహాయ పీఎఫ్ కమిషనర్లు యు.శ్రీనివాసరావు, రాధానాథ్ పట్నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కృష్ణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు వి.శేఖర్, షేక్ జబీనా, రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, క్రెడాయ్ ప్రతినిధులు మురళి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దర్శనమంటూ శఠగోపం

- అంతర్రాష్ట్ర మోసగాడి అరెస్టు
- తెలుగు రాష్ట్రాల్లో పలు కేసులు



నిందితుడితో సీఐ శ్రీనివాస్

జగ్గంపేట: తిరుమల తిరుపతి దేవస్థానంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు ఇప్పిస్తానని నమ్మించి, మోసం చేసేందుకు యత్నించిన మోసగాడిని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ బుధవారం తన కార్యాలయంలో వెల్లడించారు. కోనసీమ జిల్లా గుడిమెల్లంక గ్రామానికి చెందిన జి.రాజ్‌కుమార్ అలియాస్ విజయ్‌కుమార్ అలియాస్ వంశీపై పలు చీటింగ్ కేసులున్నాయి. 2020–24 వరకూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అనేక చోట్ల పలు కేసులు నమోదయ్యాయి. ఇతడిపై సూర్యాపేట, తణుకు, కృష్ణలంక, పాలకొల్లు, నర్సాపురం, ఎల్బీ నగర్ (హైదరాబాద్) పోలీస్ స్టేషన్లలో చీటింగ్ కేసులు ఉన్నాయి. గతంలో పాలకొల్లు, తణుకుల్లో నమోదైన కేసుల్లో ఇతడు అరెస్ట్ అయ్యాడు. సోషల్ మీడియా ద్వారా వ్యాపారాలు చేసే వారిని, ధనవంతులను లక్ష్యంగా చేసుకుని, వారికి తాను ప్రముఖ ప్రజాప్రతినిధుల పీఏగా పరిచయం చేసుకుంటూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నాడు. ఇతడు గోవా నుంచి తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. ఇదే క్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ పీఏగా గోకవరం మండలంలోని గోల్డ్ షాపు యజమాని పట్నాల నాగేంద్రకు ఫోన్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లు ఇప్పిస్తానని చెప్పి, రూ.50 వేలు ఖర్చవుతాయన్నాడు. అనుమానం వచ్చిన నాగేంద్ర అప్రమత్తం కావడంతో.. రాజ్‌కుమార్ మోసం బయటపడింది. దీనిపై టీటీడీ మెంబర్ జ్యోతుల నెహ్రూ పీఏ ప్రసాద్ జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై నిఘా పెట్టిన పోలీసులు బుధవారం జగ్గంపేట వచ్చిన సందర్భంలో అరెస్టు చేశారు. ఇతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

నారాయణ కళాశాలలో అగ్ని ప్రమాదం

షార్ట్‌సర్క్యూట్ కారణమై ఉండవచ్చని అనుమానం



కళాశాల సెల్లార్‌లో మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం మోరంపూడి సమీపంలోని సాయినగర్‌లో ఉన్న నారాయణ కళాశాలలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 8.30 సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, రాజమహేంద్రవరం అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ కళాశాల నిర్వహిస్తున్న భవనంలో హాస్టల్ ఏర్పాటుకు అవసరమైన సామగ్రిని సెల్లార్‌కు తరలించారు. బుధవారం ఉదయం సెల్లార్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. అప్పటికే కళాశాలలో ఉన్న కొందరు విద్యార్థులను సిబ్బంది అప్రమత్తమై బయటకు పంపిచేశారు. అలాగే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. రాజమహేంద్రవరం ఇన్నీస్‌పేట, ఆర్యాపురం ఫైర్ స్టేషన్లతో పాటు, కొవ్వూరు అగ్నిమాపక శకటాలు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. సెల్లార్ అంతా మంటల కారణంగా దట్టమైన పొగ అలుముకుంది. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో పరుపులు, ఫర్నిచర్, విద్యుత్ పరికరాలు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.8 లక్షల నష్టం వాటిల్లింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. ఇలాఉండగా విద్యార్థులు కళాశాలకు వచ్చే సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థులను వెనక్కు పంపేసినట్టు చెబుతున్నారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

- విక్రయించిన నిందితుడు కూడా..
- 18 వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వరుస మోటార్ సైకిళ్ల చోరీ కేసుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇటీవల జిల్లాలో ఎక్కువైన మోటార్ సైకిళ్ల చోరీలపై పోలీసులు దృష్టి సారించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పోలీసు అధికారులకు నిర్దేశించారు. ప్రకాశ్‌నగర్ సీఐ బాజీలాల్ ఆధ్వర్యంలో బృందం నిఘా పెట్టింది. ఆర్టీవో కార్యాలయం సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా, కాకినాడ గాంధీనగర్‌కు చెందిన ఇంటి సురేంద్ర అనుమానాస్పదంగా పట్టుబడ్డాడు. అతడిని విచారణ చేయగా, జిల్లావ్యాప్తంగా బైక్ చోరీలు చేస్తూ, మరో వ్యక్తికి ఇస్తున్నట్టు చెప్పాడు. అతడిచ్చిన సమాచారంతో పిఠాపురానికి చెందిన కామిరెడ్డి ఏసుబాబును పోలీసులు అరెస్టు చేశారు. 2003 నుంచి సురేంద్ర బైక్ చోరీలు చేస్తున్నాడు. అతడిపై అనకాపల్లి, రామచంద్రపురం, కాకినాడ, పామర్రు పోలీస్ స్టేషన్లలో పలు కేసులున్నాయి. అతను బైక్ చోరీ చేస్తూ చివరిసారిగా గతేడాది రామచంద్రపురం పోలీసులకు పట్టుబడ్డాడు. తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి తిరిగి దొంగతనాలు ప్రారంభించాడు. అతడికి స్టిక్కరింగ్ పని చేసే ఏసుబాబు పరిచయమయ్యాడు. ఖరీదైన బుల్లెట్లు, స్పోర్ట్ బైక్‌లు, స్కూటర్లను చోరీ చేసి, ఏసుబాబు ద్వారా సురేంద్ర అమ్మించేవాడు. రాజమండ్రి ప్రకాష్‌నగర్, త్రీటౌన్, బొమ్మూరు, కడియం, గోకవరం, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగిలించిన మొత్తం రూ.19 లక్షల విలువైన 18 వాహనాలను పోలీసులు రికవరీ చేశారు. నిందితులను పట్టుకున్న సీఐ బాజీలాల్, ఎస్సై జి.సతీష్, హెచ్‌సీ వి.నాగరాజు, సీహెచ్ శ్రీనివాసరావు, క్రైమ్ పోలీసులు కె.ప్రదీప్‌కుమార్, వీరబాబు, దుర్గప్రసాద్, శివప్రసాద్‌ను ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

29న ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఈ నెల 29న అమలాపురంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో నాలుగో యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు తెలిపారు. పోటీల పోస్టర్లను స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో సంఘ, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు దాదాపు 200 మంది పవర్ లిఫ్టర్లు హాజరవుతారని శరత్‌బాబు తెలిపారు. సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ (పురుషులు, మహిళలు) విభాగాల్లో మొత్తం 30 కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నట్టు సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ పప్పుల శ్రీరామచంద్రమూర్తి వివరించారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, ఒలింపిక్ పతకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, పవర్ లిఫ్టింగ్ పోటీల ఆర్గనైజర్, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, సంఘ ప్రతినిధులు కల్వకొలను బాబు, తిక్కిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని డి.ముప్పవరం మద్యం షాపు వద్ద ఏర్పడిన వివాదంతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు బుధవారం తెలిపారు. సోమవారం రాత్రి డి.ముప్పవరం మద్యం షాపు వద్ద బైక్ విషయంలో వివాదం తలెత్తి.. కోరుపల్లికి చెందిన వెరిపూడి దుర్గాప్రసాద్‌పై సమిశ్రగూడేనికి చెందిన శ్రీనివాస్, బాలుతో పాటు, మరో ముగ్గురు దాడి చేశారు. దుర్గాప్రసాద్ గాయాలతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

18, 21 తేదీల్లో చించినాడ వంతెనపై ట్రాఫిక్ నిలుపుదల

అమలాపురం రూరల్: దిండి–దిగమర్రు జాతీయ రహదారి బేరింగ్ రీప్లేస్‌మెంట్ పనుల కారణంగా చించినాడ వంతెన వద్ద ట్రాఫిక్‌ను ఈ నెల 18, 21 తేదీల్లో నిలుపుదల చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. ఆయా తేదీల్లో ఉదయం పది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పూర్తిగా నిలుపుదల చేస్తారన్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్ బేరింగ్‌ల కొలతలు, స్లీవ్ స్థానాల ధ్రువీకరణ కోసం స్పాలను ఎత్తివేయాలని ప్రతిపాదించారని వివరించారు. ట్రాఫిక్ నిలుపుదల సమయంలో వాహనాల రాకపోకలను ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లిస్తారని తెలిపారు. వాహనదారులు అధికారులకు సహకరించాలని కోరారు.

ఇసుక అక్రమ నిల్వలపై తనిఖీ

అమలాపురం టౌన్: పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ నిల్వలపై అధికారుల బృందం బుధవారం ఆకస్మిక తనిఖీలు చేసింది. మైన్స్, రెవెన్యూ, పోలీస్ అధికారుల బృందం ఈ తనిఖీలు చేపట్టింది. పట్టణ బైపాస్ రోడ్డులో నిల్వ చేసిన ఇసుక గుట్టలను గుర్తించి అధికారులు ఆరా తీశారు. మైన్స్ శాఖ ఆర్ఐ సునీత, తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు ఓ బృందంగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అమలాపురం తహసీల్దార్ అశోక్ ప్రసాద్ మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక నిల్వలను గుర్తించామని చెప్పారు. ఏ విధమైన అధికారిక అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా నిల్వచేస్తే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలు రద్దు చేయాలి



అడబాల చినబాబు

రాజానగరం: అధికార బలంతో ఏకపక్షంగా జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలు రద్దు చేసి, కేంద్ర బలగాల రక్షణలో ప్రజాస్వామ్య బద్ధంగా తిరిగి నిర్వహించాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, పోలీసు బలగాలను దుర్వినియోగపర్చి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి నిర్వహించిన ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా నిలుస్తాయన్నారు. ఓటర్లు పోలీసుల కాళ్లు పట్టుకున్నా కనికరించకపోవడం ఇందుకు ఉదాహరణగా వ్యాఖ్యానించారు.